క్లుప్తంగా

దాసరి ప్రియాంక సంస్మరణ సభ



గుంటూరు ఎడ్యుకేషన్: కాపు జేఏసీ నాయకుడు దాస రిరాము ఏకై క కుమార్తె దాసరి శేషసాయి ప్రియాంక సంస్మరణ సభ బుధవారం రింగ్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎండీ మస్తాన్‌వలీ, లింగంశెట్టి ఈశ్వరరావు, కిలారి రోశయ్య పాల్గొని ప్రియాంక చిత్రపటానికి నివాళులర్పించారు. సంస్మరణసభలో రాయపాటి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తులసి ధర్మచరణ్, యోగేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి



నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని.. వెంటనే సుప్రీం కోర్టు దీనిపై జోక్యం చేసుకుని పునఃసమీక్షించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యూ ఢిల్లీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ కేంద్రం వర్గీకరణ చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్‌ను అన్ని రాష్ట్రాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌ను 15 నుంచి 25 శాతానికి పెంచాలన్నారు.

ప్రణాళికాబద్ధమైన కృషితోనే విజయ సాధన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రణాళికాబద్ధమైన కృషితోనే జీవితంలో విజయాన్ని సాధించగలమని గుంటూరు జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కెరీర్ మార్గదర్శకాలపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాధిక మాట్లాడుతూ ఏకాగ్రత, పట్టుదలతో చదవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందుతారని తెలిపారు. మోటివేషనల్ స్పీకర్ సీహెచ్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు కృషి, పట్టుదలతో ముందుకు వెళ్లడం ద్వారా వాటిని సాధించగలరని అన్నారు. సృజనాత్మక శక్తిని మేల్కొలిపి, ఆసక్తి గల రంగంలో కృషి చేయడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శర్మ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధికి ఘన నివాళి



లక్ష్మీపురం: దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి అన్నారు. గుంటూరు బారా ఇమాం పంజా సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఖాసీం షరీఫ్, రుఖలీల్, అంబటి రతయ్య, మైలా కిరణ్, ఎస్ఏస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కరీం, జానీ, సాంబశివరావు, రెహమాన్, సయ్యద్ జానీ, తిరుమలరావు, రసూల్, అబ్బు పాల్గొన్నారు.

కిట్స్ అక్షరలో తరగతులు ప్రారంభం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉద్యోగ ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన ఉంటుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలోని కిట్స్ అక్షర కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కిట్స్ యాజమాన్యంపై వున్న నమ్మకంతో ఈ కళాశాలను ఎంచుకున్న తల్లి తండ్రులకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇంజినీరింగ్ సిలబస్‌తో పాటు ఇన్నోవేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్ కోడింగ్, సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవాలని గత సంవత్సరం ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలలో 120 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య, డాక్టర్ జి.గురుకేశవదాసు, డాక్టర్ షేక్ ఖమురుద్దీన్, డాక్టర్ బుల్లిబాబు, డాక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

నగరంలో అడ్డరోడ్లు గుంతలమయం

- ఇటీవల కురిసిన వర్షాలకు పెరిగిన కష్టాలు
- కల్వర్టులకు ఒకవైపు మాత్రమే సిమెంట్ కాంక్రీట్‌తో పనులు
- యథేచ్ఛగా రహదారిపై అక్రమణలు
- పట్టించుకోని పాలకులు



బ్రాడీపేట 6/19వ అడ్డరోడ్డు వద్ద వర్షాల ధాటికి గుంతలమయమైన రోడ్డు



అడ్డరోడ్డులో మట్టికుప్పలు

నగరంపాలెం: నగరంలో ప్రజలకు రోడ్లు నరకం చూపుతున్నాయి. అడ్డరోడ్లకు అనుసంధానంగా నెలకొన్న ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వారం రోజుల క్రితం కురిసిన కుండపోత వర్షాలకు మరింత గోయ్యిలుగా ఏర్పడ్డాయి. అయితే ఇటీవల సైడు కాలువలు, కల్వర్టులను నిర్మించారు. కల్వర్టులకు ఒకవైపు సిమెంట్ కాంక్రీట్‌తో పనులు చేయగా మరోవైపు కంకరరాళ్లతో వదిలేశారు. వెరసి పాదచారులు, చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు.

అడుగుకో గుంత..

బ్రాడీపేట 4/19, 5/19, 6/20, పండరీపురం సాయిబాబా గుడి, శ్రీకోదండరామాలయం సమీపాన అడ్డరోడ్లకు అనుసంధానంగా ప్రధాన రహదారి ఉంది. ఇటుగా బ్రాడీపేట, పండరీపురం, లక్ష్మీపురం, అశోక్‌నగర్, కోబాల్డ్‌పేట వైపు వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది పాదచారులు, చోదకులు ఈ అడ్డరోడ్ల మీదగా వెళ్తుంటారు. తద్వారా రాకపోకలతో రద్దీ ఉంది. అయితే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. అడుగు మేర దూరంలో గుంతలు ఏర్పడటంతో ప్రయాణించాలంటే కష్టమవుతోంది. గత వారం రోజులుగా కురిసిన కుండపోత వర్షాలకు మరింత చిత్తడిగా మారాయి. బ్రాడీపేట 6/19వ అడ్డరోడ్డు నుంచి పండరీపురం వైపు వెళ్లే రోడ్డు ప్రారంభంలో లోతట్టు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో, ఒకట్రెండు రోజులు నిలిచిపోతుందని స్థానికులు, చోదకులు వాపోతున్నారు.

సైడు కాలువకు సగం పనులు..

ఇటీవల బ్రాడీపేట 4/19, 5/19, 6/19, పండరీపురం సాయిబాబా గుడి వద్ద, శ్రీకోదండరామాల యం వద్ద అడ్డరోడ్లు, ఒకవైపు సైడు కాల్వలను సిమెంట్ కాంక్రీట్ పనులతో పూర్తిచేశారు. అయితే ఈ పనులే స్థానికులు, చోదకులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ కల్వర్టులకు ఒక వైపు మాత్రమే సిమెంట్‌తో పనులు పూర్తి చేశారు. మరో వైపు మాత్రం పూర్తిగా విస్మరించారు. కంకరరాళ్లను ఇష్టానుసారంగా తొలి వదిలేశారు. దీంతో స్థానికులు, చోదకులు అవస్థలకు పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లిన ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

సిల్ట్‌తో అవస్థలు..

మురుగు కాలువల్లో తొలగించిన మట్టికుప్పలను అక్కడే వదిలేశారు. దీంతో అక్కడక్కడ గుట్టలుగా ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టంతా కారిపోయి రహదారిపైకి చేరింది. అంతేగాక కాల్వలో మట్టికావడంతో మరింత దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోయారు. ప్రధాన రహదారిలో సాయిబాబా గుడి సమీపాన ఓ కార్ ట్రావెల్ ఉండటంతో రహదారిపైనే కార్లను నిలుపుదల చేస్తున్నారు. రహదారికి ఒక వైపు అంతా చెట్లు, స్థానికుల సామగ్రి ఉండటంతో రోడ్డు కాస్త మరింత కుదించుకుపోతుంది. దీంతో ఏడెనిమిది అడుగుల దారిలోనే రాకపోకలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం నగరంలో నెలకొన్న ట్రాఫిక్ దృష్ట్యా రహదారిలో అక్రమణలు తొలగించి, నూతన రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఈ ప్రాంత వాసులకు అనువుగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



పండరీపురం సాయిబాబా గుడి ఎదురు కల్వర్టు దుస్థితి

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

లక్ష్మీపురం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించనున్నట్లు నగర కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభల్లో భాగంగా 23వ తేదీన ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసు, జంగాల చైతన్య, గుండెబోయిన లక్ష్మి, విరిగినేని వెంకటేశ్వర్లు,బి. వెంకటేశ్వర రెడ్డి, చినపోతుల విజయకుమార్ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

కొల్లి శారద మార్కెట్ తరలింపు పుకార్లు నమ్మవద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కొల్లి శారద మున్సిపల్ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ తరలింపుపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొన్ని వ్యాపార సంఘాల వారు వ్యాపారస్తులకు అసత్య ప్రచారం చేస్తున్నారని, పూర్తి అవాస్తవమని పేర్కొన్నారు. మార్కెట్‌లోని 81 షాపులకు 25 సంవత్సరాలు లీజు గడువు ముగిసినందున నిబంధనల మేరకు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. దీని వలన నగర పాలక సంస్థ చరిత్రలో రికార్డు స్థాయిలో ఆదాయం పెంచేలా వ్యాపారస్తులు భారీ సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల తొలగింపు అన్యాయం



పొన్నూరు రోడ్డులో తొలగించిన షాపు నిర్వాహకులతో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

- అధికారుల నియంతృత్వ ధోరణి మానుకోవాలి
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా

నెహ్రూనగర్: సుందరీకరణ పేరుతో పేదల పొట్టకొట్టడం ఎంత వరకు సమంజసం అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ప్రశ్నించారు. 15వ వార్డు పొన్నూరు రోడ్డులో డ్రెయిన్ ఆక్రమించారనే కారణంతో షాపు నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే బుధవారం ఉదయం షాపులను కూల్చివేశారు. సమాచారం తెలుసుకున్న నూరిఫాతిమా సదరు ప్రాంతానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు నియంతృత్వ ధోరణితో పనిచేస్తున్నారని ఆరోపించారు. నగరం నడిబొడ్డున పాత బస్టాండ్ సెంటర్ నుంచి బస్టాండ్ వెళ్లే ప్రధాన దారిలో డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారాలు దర్జాగా చేసుకుంటుంటే వారి జోలికి వెళ్లని అధికారులు.. పట్టణ చివర..రోడ్డుకు దూరంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై గ్రీన్ సిటీ పేరుతో దౌర్జన్యంగా షాపులను తొలగించడం సిగ్గుచేటన్నారు. ఓ టిఫిన్ బండి వ్యాపారి వద్ద స్థానికులు టిఫిన్ తింటున్న సమయంలో ఆకస్మాత్తుగా వచ్చి రెండు నిమిషాల్లో షాపు ఖాళీ చేయాలని లేకపోతే కూలుస్తామని బెదిరించి కూల్చేయడం బాధాకరమన్నారు. సదరు ప్రాంతం నుంచే పట్టణ ప్రణాళిక అధికారులకు నూరి ఫాతిమా ఫోన్ చేసి మాట్లాడారు. షాపులను తొలగించుకోవాలంటే ముందుగా నోటీసులు ఇచ్చిన తరువాత తొలగించి ఉంటే వారు సహకరించే వారని.. అలా కాకుండా కొంత మంది తొలగించి.. కొంత మంది షాపులను తొలగించకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. నగర అభివృద్ధికి తామేమి అడ్డు కాదని కాని అందరికి సమ న్యాయం పాటిస్తూ ఆక్రమణలు తొలగించాలన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఎప్పుడో

గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి మోక్షమెప్పుడని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని యూనియన్ కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తుందన్నారు. ఒక్క సమస్య కూడా పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఎన్నోసార్లు తమ అసోసియేషన్ తరఫున వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, కరీముల్లా షాఖాద్రి, వై.నాగేశ్వరరావు, వి.పెదరత్తయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ అబ్దుల్ అజీజ్

నగరంపాలెం: గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఫ్యాన్సీ కళ్యాణ మండపంలో వినాయక చవితి పందిళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చవితి పందిళ్లు ఏర్పాటు చేసే వారు తప్పక అగ్నిమాపక అధికారుల అనుమతి ఉండాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐ ఎం.వీరయ్య మాట్లాడుతూ ఎవరైనా అనుమతి తీసుకోకుండా పందిళ్లు ఏర్పాటు చేయవద్దని చెప్పారు.

పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత



సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: మనతో పాటు మన చుట్టూ ఉన్న సమాజం కూడా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్ష ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి ఆకాంక్షించారు. బ్రాడీపేటకు చెందిన జీవీఎల్ జోశ్రిత అనే 8వ తరగతి విద్యార్థినికి చేయూత అందించాలని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ సంకల్పించారు. అందుకు అనుగుణంగా బ్రాడీపేటలోని కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు బూసి రాజలత, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నగర అధ్యక్షుడు రవీంద్ర, పార్టీ నేతలు వలివేటి వెంకటరమణ, డేవిడ్, పొట్టూరి శ్యాం, భాగ్యారావు, దాసరి రమేష్, మహేంద్ర గులేచా, విజయమాధవి, సత్యవతి, విజయమ్మ, కరుణశ్రీ, సింగు నరసింహారావు, కొండిన్య, సుబ్బరాజు, నవీన్, ప్రసన్న, శంకర్, నారాయణ, సుబ్బారావు, శంకర్, చందు, ఈశ్వరరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



గాయనీ, గాయకులతో మేకల రవీంద్రబాబు, జాస్తి వీరాంజనేయులు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అఖిల భారత చిరంజీవి యవత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈసందర్భంగా గాయనీ, గాయకులు బీఆర్ సుశీల్ కుమార్, హెలెన్ కుమారి, వై.హేమమాలిని, బి. భారతి, పి.గాయత్రి, ఎ.సౌజన్య, సీహెచ్ రజిని, మేకల పురుషోత్తం, పి.లలితబాబు, బాబూరావు, అబ్దుల్ ఖాదర్, ఎ.రత్నాజీ, ఎం.మల్లేశ్వరరావు చిరు సినిమాల్లోని గీతాలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు, గాదె రత్నారెడ్డి, దాసంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు. అనంతరం గాయకులను సన్మానించారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి



బిల్డర్లతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని నగరంలో రియల్టర్లు, బిల్డర్లు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బిల్డర్స్‌తో నగర కమిషనర్ ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను వినియోగించుకొని రెగ్యులరైజ్ చేసుకోవాలని కోరారు. జూన్ 30, 2025 వరకు వేసిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుం, 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుం బదులుగా 7 శాతం మాత్రమే చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించిందని వివరించారు. గడువు అనంతరం క్రమబద్ధీకరించుకోని అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, డ్రెయినేజీ అనుమతించబడవని స్పష్టం చేశారు.

డ్రెయిన్ టూ డ్రెయిన్ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి

నెహ్రూనగర్: రోడ్ల నిర్మాణానికి ముందే డ్రెయిన్లు తప్పనిసరిగా నిర్మించాలని, రోడ్డు నిర్మించే సమయంలో డ్రెయిన్ టూ డ్రెయిన్‌రోడ్డు నిర్మించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత గడువు మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఉద్యోగనగర్, విజయపురి కాలనీ, విద్యానగర్, నవభారత్ నగర్‌లలో పర్యటించారు. పొన్నూరు రోడ్‌లో రోడ్డులో డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా 'కళ్లం'లో విద్యబోధన

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం కళ్ళం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి విద్యార్థికి అవసరమైన సౌకర్యాలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళ్ళం సంస్థలు స్థాపించిన కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత సాంకేతిక విద్య, ఉపాధి కల్పన ముఖ్య ధ్యేయంగా మా కళాశాల పనిచేస్తుందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 1200 మందికి పైగా ఇంజనీరింగ్ డిగ్రీలో ప్రవేశాలు జరిగాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి.వేంకటేశ్వర రెడ్డి, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసులు, కళాశాల ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోండి

- మండల వ్యవసాయ అధికారి కిశోర్
- వెంగళాయపాలెంలో పొలం పిలుస్తోంది



రైతులతో వ్యవసాయశాఖ అధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం, చల్లావారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కిశోర్ పాల్గొని మాట్లాడుతూ పంట విత్తిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో వీఏఏని కలిసి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందకపోతే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ నందు నమోదు చేసుకోవడానికి ఆగస్టు 25వ తేదీ వరకూ మాత్రమే సమయం ఉందని తెలిపారు. ఎన్‌పీసీఐ ఇన్ ఆక్టివ్‌లో ఉన్న రైతులు వారికి సంబంధిన బ్యాంక్‌కి వెళ్లి ఎన్‌పీసీఐ ఆక్టివ్ చేయించుకోవాలని, లేదా భారత తపాలా కేంద్రాలలో అకౌంట్ ఓపెన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ అమౌంట్ ఆ అకౌంట్‌లో పడతాయని తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లో ఎరువులను పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల అవశ్యకతను వివరించి ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డును తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కంది మినికిట్స్ విత్తనాలు రైతులకు అందజేశారు. వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో కేజీకి రూ 5 రూపాయల రాయితీపై రూ 38 రూపాయల చొప్పున 25 కేజీల బ్యాగ్స్‌లో పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం బీపీటీ 5204, ఎంటీయూ 1224 రకాల విత్తనాలు అందుబాటులో ఉంచిందన్నారు. వెంగళాయపాలెం సీఆర్‌పీ అనసూయ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి భావి తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితకుమారి, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆళ్ల కృష్ణమూర్తి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ వేణుమాధురి, ప్రకృతి వ్యవసాయ ఆర్‌పీ సరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తాము ఎల్లపుడూ కృషి చేస్తామని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. బుధవారం పెద పలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు భవనం నాగలక్ష్మికి కె.ఎల్.డీమ్డ్‌టూబి యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. డాక్టర్ వారణాసి భగవాన్ పరిశోధనా పర్యవేక్షణలో ఎఫెక్ట్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆన్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచింగ్ సర్ఫేస్ ఏ న్యూమెరికల్ అప్రోచ్ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ టీవీఎన్ ప్రసన్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.